నేటి కందం- నేటికి అందం

పేలికలను చీలికలను
చాలగ జతచేర్చి కుట్టి సంయమనముతో
తాలిమితో సేవల నిడ?.
మేలుగ జరిపెదము కుట్టు మిషను దినంబున్ !!

(జూన్ 13 ప్రపంచ
కుట్టు మిషన్ దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

కాళేశ్వర నిర్మాణం
కర్త కర్మ నేనన్నడు
మంత్రివర్గ నిర్ణయమని
మరి నేడు ఎట్లన్నడు
గత ప్రభుత్వ అధినేత
ఘన కీర్తికి మచ్చ కాదా
జనంలో ఉన్న పరువు
జరంతైనా ఊడిపోదా



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 13-6-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:240 పేజీలు:6 వెల: రూ.1/-

# అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిర్ ఇండియా విమానం



### విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాని మృతి
### టేకాఫ్ అవుతుండగా ఇళ్లపై కూలిన విమానం

## విమానంలో 242 మంది మృతి

### రంగలోకి దిగిన ఫైర్ సిబ్బం,సహాయ సిబ్బంది
### ప్రమాదంపై ప్రధానమంత్రి, మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి
### -హోం మంత్రి అమిత్ షా ప్రమాదం పై ఆరా









అహ్మదాబాద్ , జూన్ 12:విమానాశ్రయంలో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలింది .. విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో ఆకస్మికంగా ఇళ్లపై కుప్పకూలిపోయింది.. ఆ వెంటనే విమానానికి మంటలు అంటుకున్నాయి. ఈ విమానంలో మొత్తం 242 ప్రయాణికులు మరణించారు. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలు ఆర్పుతున్నాయి.. ఈ విమానం అహ్మదాబాద్ నుంచి లండన్ కు వెళ్లాల్సి ఉంది.

షాహీబాగ్ హోటల్ సమీపంలో విమానం కూలడంతో పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. వెంటనే అలర్ట్ అయిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పుతున్నారు. ఇక పోలీసులు ప్రయాణికులను రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను అంబులెన్సులలో హుటాహుటినా ఆసుపత్రికి తరలిస్తున్నారు. కాగా ఇప్పటి వరకు విమానంలోంచి వంద మందికి పైగా ప్రయాణీకులను రక్షించారు. మిగిలిన వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

**మెడికల్ కాలేజ్ హాస్టల్‌పై కూలిన విమానం..**

గుజరాత్ రాష్ట్రంలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిపోయింది గురువారం మధ్యాహ్నం 1.39 గంటలకు ఇద్దరు పైలట్లు, 10 మంది క్యాబిన్ సిబ్బందితో పాటు 242 మంది ప్రయాణికులతో లండన్ బయల్దేరి ఫ్లైట్.. టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే ఎయిర్‌పోర్టుకు సమీపంలోని సివిల్ ఆస్పత్రి వద్ద బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కుప్పకూలింది. ఈ ఘటనలో హాస్టల్ భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇందుకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

కుప్పకూలిన విమానం ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 ఫ్లైట్ గా గుర్తించారు.

కాగా, అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా ప్రమాదంపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హుటాహుటిన అహ్మదాబాద్‌కి బయలుదేరారు. ఈ విషయంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా గుజరాత్ సీఎంతో ఫోన్లో మాట్లాడారు. విమాన ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఆరా తీశారు.

అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మొత్తం 230 ప్రయాణీకులు , 12 మంది సిబ్బంది , 14 మంది మెడికోస్ బి దుర్మరణం చెందారు.. విమాన ప్రమాదంలో అందులో ఉన్న ప్రయాణీకులెవ్వరూ బతికే అవకాశం లేదని అహ్మదాబాద్ నగర్ పోలీస్ కమిషనర్ ప్రకటించారు. అలాగే ఈ విమానంలో లండన్ వెళుతున్న గుజరాత్ మాజీ సిఎం విజయ రూపాని కూడా కన్నుమూశారు. కాగా విమానం స్థానిక బిజె వైద్య కళశాల హాస్టల్ పై కుప్ప కూలడంతో అక్కడ లంచ్ చేస్తున్న పలువురు గాయపడ్డారు.. వారిలో ఇప్పటి వరకు 14 మంది మెడికల్ విద్యార్థులు మరణించినట్లు అధికారికంగా ప్రకటించారు..

**అహ్మదాబాద్ ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి, సత్వర సహాయం అందిస్తామని హామీ**

ఈ రోజు అహ్మదాబాద్ లో జరిగిన ప్రమాదం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్ర విచారం ది,గ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటన దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఇది మాటల్లో చెప్పలేని హృదయ విదారక ఘటన అని అన్నారు.

ఈ ప్రమాదంలో బాధితులకు సత్వరమే తగిన సాయం అందించేందుకు మంత్రులు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని శ్రీ మోదీ అన్నారు.


**విమాన ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం ..**

అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటన తనను తీవ్రగ్భ్రాంతికి, ఆవేదనకు గురిచేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు , ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ , పేర్కొన్నారు. ఈ దురదృష్టకర సంఘటన పట్ల వారు విచారం వ్యక్తం చేశారు.

"అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ ఘటన చాలా బాధాకరం" అని చంద్రబాబు వివరించారు. ప్రమాదంలో చిక్కుకున్న ప్రయాణికులు, విమాన సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో పాటు, ఈ ఘటన వల్ల ప్రభావితమైన స్థానిక నివాసితుల గురించి తాను ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. బాధిత ప్రయాణికులు, సిబ్బంది, వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. వారందరి కోసం తాము ప్రార్థనలు చేస్తున్నామని, ఈ కష్ట సమయంలో వారికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

**సమాచారాన్ని సేకరిస్తున్నాం : ఎయిర్ ఇండియా**

అహ్మదాబాద్‌లో విమానం కూలిన ఘటనపై ఎయిర్ ఇండియా స్పందించింది. తన ఎక్స్ అకౌంట్‌లో ప్రమాదం గురించి పోస్టు చేసింది. ఫ్లయిట్ ఏఐ171 కూలినట్లు చెప్పింది. అహ్మదాబాద్ నుంచి లండన్ గాట్విక్‌కు ఆ విమానం వెళ్తున్నట్లు తన ట్వీట్‌లో ఎయిర్ ఇండియా కంపెనీ వెల్లడించింది. జూన్ 12వ, 2025 తేదీన ప్రమాదం జరిగినట్లు చెప్పింది. ప్రస్తుతం ఆ దుర్ఘటనకు చెందిన సమాచారాన్ని సేకరిస్తున్నామని, వీలైనంత త్వరలో ఆ విషయాలను తమ ఎక్స్ ఖాతాలో వెల్లడించనున్నట్లు ఎయిర్ ఇండియా చెప్పింది.



## ఒక్కో ప్రయాణీకుడికి రూ. కోటి నష్ట పరిహారం

ముంబాయి , జూన్ 12: విమాన ప్రమాదంపై ఎయిర్ ఇండియా ఎండీ, సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.కోటి పరిహారం ప్రకటించింది.

విమానంలో 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నట్లు వెల్లడించారు. కాగా ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.ఈ క్షణంలో బాధ వర్ణనాతీతమని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. క్షతగాత్రులకు వైద్య ఖర్చులన్నీ తామే భరిస్తామన్నారు. వారికి అవసరమైన సహకారం అందించి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అలాగే, ఈ విమానం కుప్పకూలడంతో ధ్వంసమైన బిజే మెడికల్ హాస్టల్ నిర్మాణానికి సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఆడం రాజ్ దెక్కపాటి



హైదరాబాద్ జూన్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ ఆడం రాజ్ దెక్కపాటి గురువారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని వారి కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ కోసం పని చేసిన విధానాలను క్రిస్టియన్ కమ్యూనిటీకి సంబంధించి చేస్తున్న సహకారాలను గుర్తించి తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియమించిన విషయంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆడం రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ మరియు కాంగ్రెస్ పార్టీ ఆల్ ఇండియా కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరియు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మరియు ఉత్తంకుమార్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ లకు ధన్యవాదములు తెలిపారు.

## విమాన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరుగుతోంది : కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



అహ్మదాబాద్ , జూన్ 12:అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమానం ప్రమాద ఘటన తననుగ్భ్రాంతికి గురి చేసిందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ప్రమాదం విషయం తెలియగానే విజయవాడ నుంచి బయలుదేరానన్నారు. ప్రధాని మోదీ ఫోన్ చేసి ప్రమాదం గురించి వివరాలు అడిగారని తెలిపారు. విమాన ప్రయాణికుల్లో చిన్నారులు కూడా ఉన్నారని.. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. అన్ని కోణాల్లో లోతైన దర్యాప్తు జరుగుతోందని.. మృతుల సంఖ్య గురించి ఇప్పుడే ఏం చెప్పలేమన్నారు. మృతుల సంఖ్య గురించి ఇప్పుడే ఏం చెప్పలేమని.. విమాన ప్రమాద బాధ్యులను ఉపేక్షించమని స్పష్టం చేశారు. విమాన ప్రయాణికుల్లో విజయ్ రూపానీ ఉన్నారన్నారు. ప్రమాద ఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు.

సహాయక చర్యలపై డీజీసీఏ, ఏఏఐ, ఎన్డీఆర్ఎఫ్, గుజరాత్ ప్రభుత్వ సీనియర్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ దర్యాప్తు కోసం బృందంతో అహ్మదాబాద్‌కు చేరుకుంది. ప్రమాదానికి సంబంధించి అన్ని కారణాలపై ఆరా తీస్తున్నది. దర్యాప్తు తర్వాత ప్రమాదానికి కారణాలు తెలిసే అవకాశాలున్నాయి. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు గురువారం మధ్యాహ్నం 1.38 గంటలకు బయలుదేరి రెండు నిమిషాల తర్వాత 1.40 గంటలకు కూలిపోయింది. ఈ విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటిష్ జాతీయులు, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులు, ఒకరు కెనడియన్ పౌరుడు ఉన్నారు. ప్రమాదం నుంచి ఒకరు బయటపడగా.. మిగతా ఎవరూ బతికేందుకు అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, విమానం ఓ మెడికల్ ఆసుపత్రి హాస్టల్‌పై కూలడంతో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఎందరు చనిపోయారన్న విషయాన్ని అధికారులు ధ్రువీకరించలేదు.

## తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు

హైదరాబాద్ జూన్ 12(ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. గురువారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. శుక్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. అలాగే, సోమ, మంగళవారాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొనసాగుతాయని చెప్పింది. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు పలు జిల్లాల్లో వర్షాలు పడుతాయని వివరించింది.

## డాక్టర్స్ హాస్టల్‌పై కుప్పకూలిన ఎయిరిండియా విమానం : పోలీస్ ఆఫీసర్

అహ్మదాబాద్ , జూన్ 12:అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఎయిర్‌పోర్టుకు సమీపంలోని సివిల్ ఆస్పత్రి వద్ద బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై ఎయిరిండియా విమానం కుప్పకూలినట్లు పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. విమానం కుప్పకూలిందన్న విషయం తెలిసిన 2 నుంచి 3 నిమిషాల వ్యవధిలోనే పోలీసులు, ఇతర ఏజెన్సీలు ఘటనాస్థలానికి చేరుకున్నాయని తెలిపారు. ఘటనాస్థలంలో మంటలను అదుపు చేశామని, 80 శాతం వరకు సహాయక చర్యలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్, బీఎస్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమైనట్లు చెప్పారు. విమానం కూలిన ప్రాంతంలో రెండు భవనాలకు మంటలు అంటుకున్నాయని పోలీసు ఆఫీసర్ తెలిపారు. విమానం కూలిన సమయంలో భారీ శబ్దం వినిపించడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు.

## మాజీ ఎంపీటీసీ తీగల రంజిత్ రెడ్డి మరణం తీరని లోటు : ఎమ్మెల్యే సబిత

హైదరాబాద్, జూన్ 12: మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ తీగల రంజిత్ రెడ్డి తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు.. రంజిత్ రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రంజిత్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం అంత్యక్రియ కార్యక్రమంలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# వస్త్ర పరిశ్రమ రూపురేఖల్ని మార్చివేసిన కుట్టు మిషన్ ఆవిష్కరణ

## (13 జూన్ "జాతీయ కుట్టు మిషన్ దినోత్సవం" సందర్భంగా)

పూర్వకాలంలో నూలు వస్త్రాలను శ్రమించి చేతులతో కుట్టుకునే సంస్కృతి నుంచి నేడు కుట్టు యంత్రం లేదా సీవింగ్ మిషన్ ఆవిష్కరణ తర్వాత అతి తక్కువ సమయం, శ్రమ వెచ్చించా అత్యంత సులభంగా, అందమైన రీతుల్లో వస్త్రాలు కుట్టుకోవడానికి మార్గం సుగమం అయ్యింది. నేడు ఇంటింటి నేస్తం అయ్యింది కుట్టు మిషన్. మహిళలకు ఆకడత్వ మిత్రుడి వలె నిలుస్తూ, జీవనోపాధులను చూపుతోంది అద్భుత కుట్టు యంత్రం. నేడు వస్త్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కడానికి నేడు కుట్టు మిషన్లు మానవ ప్రమేయ యంత్రాలు, ఎలక్ట్రానిక్, కంప్యూటరైజ్డ్, ఎలక్ట్రిక్ రూపాల్లో పలు సైజులు, ఆకృతుల్లో కనిపిస్తున్నాయి. కుట్టు మిషన్ల రాకతో టైలరింగ్ వృత్తితో పాటు అసంఖ్యాక మహిళలు ఇంటి నుంచే బట్టలు కుడుతూ తమ తమ జీవనోపాధులను పొందడం జరుగుతున్నది.

### జాతీయ కుట్టు మిషన్ దినం:

కుట్టు మిషన్ ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 13 జూన్‌న "జాతీయ కుట్టు మిషన్ దినం లేదా నేషనల్ సీవింగ్ మిషన్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. కుట్టు మిషన్ ఆవిష్కరణ మానవాళి నిత్య జీవితంలో, జీవనశైలిలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. ఫ్యాషన్ ప్రపంచానికి ఇది ఓ అద్భుత వరంగా మారింది. పెద్ద ఎత్తున వస్త్రాలను తయారు చేయడం, ఫ్యాషన్ లోకంలో అసంఖ్యాక డిజైన్లను పరిచయం చేయడం, వస్త్ర పరిశ్రమ రూపురేఖల్ని మార్చి వేయడం కొనసాగుతోంది. నేడు టైలరింగ్ వృత్తులు, ఫ్యాషన్ డిజైనర్లు, సాధారణ మహిళలు, అభిరుచి కలిగిన వ్యక్తులు కుట్టు మిషన్ ప్రాధాన్యాలను గుర్తించి దాని ప్రచారానికి ఎనలేని కృషి చేస్తున్నారు. జాతీయ కుట్టు మిషన్ దినం వేదికగా కుట్టు మిషన్ ప్రదర్శనలు, కుట్టు మిషన్ పని తీరు పట్ల అవగాహన, కుట్టు మిషన్ సహాయంతో తయారు చేసిన పలు రకాల వస్త్ర డిజైన్ల ప్రదర్శనలు, ప్రఖ్యాత టైలర్లను సన్మానించడం లాంటివి చేయవచ్చు.

### కుట్టు మిషన్ పుట్టుక :

కుట్టు మిషన్ చరిత్ర 150 ఏండ్ల క్రితమే ప్రారంభమైంది. 13 జూన్ 1829 రోజున ఫ్రెంచ్ టేలర్ "బార్థలెమి టిమ్మోనియర్" కృషితో కుట్టు యంత్రం కనుగొనబడింది. అంతకు పూర్వం పలు ప్రయత్నాలు జరిగిన విషయం కూడా జరగడం జరిగింది. 10 సెప్టెంబర్ 1847న అమెరికన్ "ఇలియాస్ హోవె" తొలిసారి కుట్టు మిషన్‌ను పేటెంట్ చేసారు. 1851లో "ఐజాక్ సింగర్" అను శాస్త్రవేత్త అత్యాధునిక కుట్టు యంత్రం రూపొందింది వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడం జరిగింది. కుట్టు మిషన్ తయారీలో తమ మేధస్సును వెచ్చించిన పలువురు ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం మన కనీస బాధ్యత అవుతుంది.

నేడు వస్త్ర పరిశ్రమ పెద్ద ఎత్తున పెరగడానికి పునాదిగా కుట్టు మిషన్ నిలుస్తున్నది. నేడు కుట్టు మిషన్ సామాన్యుల ఇంటిలో ఒక భాగం అయ్యింది. మహిళలు తమ ఇంటి వస్త్రాలను, జీవనోపాధిగా ఇతరుల వస్త్రాలను కుట్టడానికి మన కుట్టు మిషన్ దోహదపడుతున్నది. మనకు వస్త్రాలను కుట్టి, మన అందాన్ని ఇనుమడింపజేస్తున్న టైలర్స్‌కు కృతజ్ఞతలు తెలుపుదాం. కుట్టు మిషన్ల ప్రదర్శనలకు వెళ్లి పలు రకాల కుట్టు యంత్రాలను చూసి వద్దాం.

# భారతీయ రైల్వేల్లో రెండు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు మంత్రిమండలి ఆమోదం...

న్యూఢిల్లీ, జూన్ 12:రైల్వే మంత్రిత్వ శాఖ రూ.6,405 కోట్ల మొత్తం వ్యయంతో ప్రతిపాదించిన రెండు ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన గల ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు:-

కోడర్మా-బర్కాకానా డబ్లింగు (133 కిలోమీటర్లు): ఈ ప్రాజెక్ట్ సెక్షను ఝార్ఖండ్‌లోని ఒక ముఖ్య బొగ్గు ఉత్పాదక క్షేత్రం మీదుగా సాగుతుంది. దీనికి అదనంగా ఇది పాట్నా, రాంచీల మధ్య అన్నింటి కన్నా చిన్నదీ, ఎక్కువ సమర్థమైన రైలు లింకుగా కూడా ఉండబోతోంది.

బళ్లారి-చిక్‌జాజుర్ డబ్లింగు (185 కి.మీ.): ఈ ప్రాజెక్ట్ లైను కర్నాటక లోని బళ్లారి, చిత్రదుర్గ జిల్లాలతో పాటు ఆంధ్ర ప్రదేశ్ లోని అనంతపురం జిల్లా నుంచి సాగుతుంది.

లైన్ సామర్థ్యాన్ని పెంచడం రాకపోకలను చెప్పుకోదగ్గ స్థాయిలో పెంపొందించనుంది. దీంతో భారతీయ రైల్వేల నిర్వహణ కార్యకలాపాల సామర్థ్యంతో పాటు సేవాపరమైన విశ్వసనీయత కూడా మెరుగవుతుంది. ఈ మల్టీట్రాకింగ్ ప్రతిపాదనలతో నిర్వహణ కార్యకలాపాలు సువ్యవస్థితం కావడంతో పాటు రద్దీని నివారించడానికీ అవకాశం ఏర్పడుతుంది. ఈ ప్రాజెక్టులు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'న్యూ ఇండియా' (నవ భారత్) దార్శనికతకు అనుగుణంగా ఉన్నాయి. ఇవి ఆయా ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతూ, ఆ ప్రాంతాల ప్రజలను "ఆత్మనిర్భర్" (స్వయంసమృద్ధం)గా తీర్చిదిద్దగలవు. దీంతో వారికి ఉద్యోగావకాశాలు, స్వయంఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

బహుళ విధ సంధానాన్ని (మల్టి-మోడల్ కనెక్టివిటీ) అందుబాటులోకి తీసుకు రావాలని ఉద్దేశించిన పీఎం-గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో ఆ ప్రాజెక్టులు ఒక భాగం. ఏకీకృత ప్రణాళిక రచనతో ఇది సాధ్యపడింది. ఈ తరహా సంధానం ప్రజల రాక- పోక, వస్తువులు-సేవల రవాణాకు ఎలాంటి అంతరాయం ఎదురవకుండా చూస్తుంది.

ఈ రెండు ప్రాజెక్టులూ ఝార్ఖండ్, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్‌లలో ఏడు జిల్లాల మీదుగా సాగుతాయి. దీంతో భారతీయ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్క్ మరో 318 కి.మీ. మేర విస్తరిస్తుంది.

ఆమోదించిన మల్టి-ట్రాకింగ్ ప్రాజెక్టు తో దాదాపుగా 28.19 లక్షల మంది జనాభాకు మేలు కలుగుతుంది. సుమారుగా 1,408 గ్రామాలకు సంధాన (కనెక్టివిటీ) సదుపాయం పెరుగుతుంది.

ఇవి బొగ్గు, ఇనుప ఖనిజం, తుది ఉక్కు, వ్యావసాయక సరకులతో పాటు పెట్రోలియం ఉత్పాదనలు తదితర సరకుల రవాణాకు అత్యంత ముఖ్యమైన మార్గాలు. సామర్థ్యాన్ని పెంచడానికి చేపట్టే పనులతో అదనంగా 49 ఎంటీపీఏ (మిలియన్ టన్స్ పర్ యానమ్) మేరకు సరకును రవాణా చేయవచ్చు. రైల్వేలు పర్యావరణానుకూలమైనవి, తక్కువ ఇంధనాన్ని వినియోగించుకొనే రవాణా సాధనం కావడం వల్ల వాతావరణ పరంగా నిర్దేశిత లక్ష్యాల సాధనకు దోహదపడడంతో పాటుగా దేశానికి అవుతున్న ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్) ఖర్చును, చమురు దిగుమతి ని తగ్గించడం (52 కోట్ల లీటర్లు)తో పాటు కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను 264 కోట్ల కేజీల మేర కుదించనున్నాయి. కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల కుదింపు పరిమాణం 11 కోట్ల మొక్కలను నాటి, వాటిని పెంచినందువల్ల కలిగే ఫలితాలకు సమానంగా ఉండబోతోంది.

# సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అభివృద్ధి సాధన... ఇదే మా నిబద్ధత... ప్రధానమంత్రి పునరుద్ఘాటన

న్యూఢిల్లీ, జూన్ 12:సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగిపోవాలన్న మొక్కవోని నిబద్ధత ప్రభుత్వానిదని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పునరుద్ఘాటించారు. రక రకాల ప్రజానుకూల పథకాల ప్రయోజనాలు వీలయినంత ఎక్కువ మంది పౌరులకు లబ్ధిని చేకూర్చేటట్లుగా తగిన జాగ్రత్త చర్యలను తీసుకొంటామని కూడా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలతో క్రమేణా చాలా మందికి ప్రయోజనాలు అందుతున్నాయని ఆయన ప్రశంసలు కురిపించారు.

కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పొందుపరిచిన ఒక పోస్టుకు శ్రీ మోదీ స్పందిస్తూ "ఇది ప్రశంసనీయ వృద్ధి..సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అభివృద్ధి సాధన బాటలో సాగిపోవడం మా నిబద్ధత... దీనిని ఈ వృద్ధి సూచించడంతో పాటు, మేం అమలు చేస్తున్న అనేక ప్రజానుకూల పథకాలతో రానురాను మరింత ఎక్కువ మందికి ప్రయోజనాలు కలుగుతున్నాయని కూడా ఇది చాటిచెబుతోంది" అని పేర్కొన్నారు.

# మన ఆరోగ్యం కోసమే యోగా : కమిషనర్ రవీంద్రబాబు



కర్నూలు బ్యూరో, జూన్ 12: యోగా కార్యక్రమం మన ఆరోగ్యం కోసమేనని, దీనిని అందరూ అలవాటు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు ప్రజలను కోరారు. గురువారం ఉదయం కర్నూలు పట్టణంలో పర్యాటక ప్రదేశం, చారిత్రాత్మక కట్టడమైన కొండారెడ్డి బురుజు దగ్గర చేపట్టిన యోగా కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 21 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని, అందులో భాగంగా పర్యాటక ప్రదేశమైన కొండారెడ్డి బురుజు వద్ద ఈరోజు యోగా కార్యక్రమాన్ని నిర్వహించు కుంటున్నామని తెలిపారు. ఈనెల 17న అవుట్ డోర్ స్టేడియంలో జిల్లాలోని మున్సిపల్ కార్మికులతో, స్థానికులతో కలిసి 5,000 మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, దానిని కూడా ఈరోజు లాగా విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

ఈసందర్భంగా సీఈవో సెట్కూర్ వేణుగోపాల్, ఎన్సిసి కమాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ ఇందులో సహకరించిన అందరికీ, పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి , సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, డిఎస్ఓ రాజా రఘువీర్, డిఎస్పి రాఘవేంద్ర ఆచారి, జిల్లా టూరిజం అధికారి విజయ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగ శివలీల, ఎన్సిసి కమాండెంట్ ప్రసాద్, రాష్ట్ర యోగ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అవినాష్, జిల్లా ఆయుష్ అధికారులు డా.శ్రీనివాసులు, డాక్టర్ ప్రసాద్, కార్పొరేటర్ లు కైప పద్మలతా రెడ్డి, నిలోఫర్, ఎన్ సిసి విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు.

# పిడుగులు పడి ఆరుగురు దుర్మరణం



ఆదిలాబాద్, జూన్ 12: ఆదిలాబాద్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పిడుగులు పడి ఆరుగురు మృతిచెందారు. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ, బేల మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కురిసిన పిడుగుపాటుకు ఆరుగురు మృతిచెందారు.

గాదిగూడ మండలం పిప్రిల్ సౌరే గ్రామానికి చెందిన శిడం రాం బాయ్, పెందూరు మాధవరావు, పెందూరు సంజన, మంగు భీమ్ భాయి నలుగురు మృతిచెందగా, వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. అదేవిధంగా బేల మండలం సంగడి గ్రామంలో పంట చేనులో విత్తనాలు నాటుతుండగా పిడుగు పడి గెడం నందిని (45), ఫోన్ కాస్ట్ గ్రామంలో పంట చేనులో కోవా సునీత (38) పిడుగు పడి మృతి చెందింది. ఒకే రోజు ఆరుగురు మృతిచెందగా మరో నలుగురు తీవ్ర గాయాలతో రిమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. మృతులంతా గిరిజనులే. సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు.

# సమగ్ర వృద్ధితో పాటు జాతీయ సాధికారతతో 11 ఏళ్లు ...

న్యూఢిల్లీ, జూన్ 12:సమగ్ర వృద్ధితో పాటు దేశ ప్రజలకు సాధికారత కల్పనతో కూడిన 11 సంవత్సరాల కాలం గణనీయ ప్రభావాన్ని ప్రసరించిందని వివరించిన ఓ వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు షేర్ చేశారు. ఇది చెప్పుకోదగ్గ పద్ధతుల్లో మన దేశానికి సాధికారతను సంతరించి, దేశం స్థాయిని పెంచడంతో పాటు దేశాన్ని పురోగమించేటట్లు చేసిందని ఆయన వ్యాఖ్యానించారు.

"11 ఏళ్లలో చోటుచేసుకున్న సమగ్ర వృద్ధిని కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ (ఏంబష్ట్రలితినితిఎజీతిబష్ట్రనిజీలి) ఓ వ్యాసంలో వివరించారు. ఈ వృద్ధి ప్రస్థానం పౌరులకు అనేక విధాల ప్రయోజనాలను కలగజేయడంతో పాటు మరీ ముఖ్యంగా ఒక నమ్మకాన్ని కలిగించింది. ఆ నమ్మకం సాధికారతను కల్పించేదీ, అభ్యున్నతికి దోహదపడేదీ, దేశాన్ని పురోగమన పథంలో దూసుకుపోయేటట్లు చేసేదీనూ.

చాలా విషయాలను కూలంకషంగా చర్చించిన ఆ వ్యాసాన్ని ఓసారి చదవండి." అని పేర్కొన్నారు.

# కేరళ తీరానికి దూరంగా మంటలు చెలరేగిన కంటెయినర్ నౌక: ఐసీజీ ప్రయత్నాలు ముమ్మరం

న్యూఢిల్లీ, జూన్ 12:మంటలు చెలరేగుతూ ఉన్న సింగపూర్ కంటెయినర్ నౌక 'ఎమ్‌వీ వాన్ హయి 503'లోకి రక్షక దళానికి చెందిన అయదుగురు సభ్యులు, ఎయిర్‌క్రూ కు చెందిన లోతట్టు జలాల్లో ఈదడంలో నిపుణుడైన వ్యక్తిని భారతీయ కోస్తా తీర రక్షకదళం (ఐసీజీ) బుధవారం (జూన్ 11న) పంపించింది. ఈ నెల 9న కేరళ తీరంలో మంటలు అంటుకున్న సింగపూర్ కంటెయినర్ నౌక కేరళలోని బేపూర్‌కు సుమారు 42 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న భారత ప్రత్యేక ఆర్థిక మండలం (ఈఈజడ్) లోపలకు- ఆగ్నేయ దిశ నుంచి- చొచ్చుకువస్తోంది.

నౌకలో 2,128 మెట్రిక్ టన్నుల ఇంధనంతో పాటు వందల కొద్దీ కంటెయినర్లు ఉన్నాయి. వాటిలో ప్రమాదకరమైన సరుకు కూడా ఉంది. దీంతో సముద్ర పర్యావరణానికే కాకుండా, ఆ ప్రాంతంలో నౌకారవాణా మార్గాలకు కూడా పెద్ద ముప్పు ఎదురుకావొచ్చు. మంటలను ఆర్పడానికి ఐసీజీ చేపట్టిన ప్రయత్నాలతో, ఇంతవరకు చెలరేగిన జ్వాలలు చాలా వరకు తగ్గిపోయాయి. ఇప్పుడు కార్గో హోల్డులలోనూ, బేస్ లోనూ పొగ మాత్రమే కనిపిస్తోంది. ఏమైనా, లోపలి భాగపు డెక్‌లలోనూ, ఇంధన ట్యాంకుల సమీపంలోనూ ఇప్పటికీ ఇంకా మంటలు రేగుతూ ఉన్నట్లే అగుపిస్తోంది.

మంటలను ఆర్పే కార్యకలాపాలలో అయిదు ఐసీజీ నౌకలు, రెండు డార్నియర్ విమానాలతో పాటు ఒక హెలికాప్టర్ సేవలను వినియోగించుకొంటున్నారు. షిప్పింగ్ డైరెక్టరేట్ జనరల్‌కు చెందిన రెండు నౌకలు కూడా తమ వంతు సహాయాన్ని అందిస్తున్నాయి. నౌక యజమానులు రంగంలోకి దించిన ఒక రక్షణ దళం కూడా ఐసీజీతో కలిసి పనిచేస్తోంది. అదనంగా వైమానిక సహాయాన్ని సమకూర్చాల్సిందిగా భారతీయ వైమానిక దళానికి కూడా విజ్ఞప్తి చేశారు.

మంటలు ఇంకా పూర్తి స్థాయిలో చల్లారలేదు.. ఇది పర్యావరణానికి ఏదైనా విపత్తును తెచ్చిపెట్టకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి టో లైనును ఏర్పాటు చేయడానికి, నౌకను తీరం నుంచి దూరంగా ఈడ్చుకుపోవడానికి సంబంధించిన ప్రయత్నాలు చేస్తున్నారు. స్థితి ఇప్పటికీ గంభీరంగానే ఉండడంతో, నిరంతర ప్రాతిపదికన పర్యవేక్షిస్తున్నారు.

# ప్రైవేటు జాబ్‌లో..కొత్త సిస్టం.. ఇక ఎనిమిది కాదు పది గంటల పని

**-ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం**
**-8 గంటల నుంచి 10 గంటలకు మార్పు**
**-కార్మిక చట్టంలో సవరణ చేసిన సర్కారు**
**-పెట్టుబడులు ఆకర్షించేందుకేనని స్పష్టత**
**-ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసమేనట**
**-స్పష్టం చేసిన మంత్రి పార్థసారథి**
**-పని గంటలు 10కి పెంచుతూ ఉత్తర్వులు జారీ**
**-కేరళ, అసోం, తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాల్లోనూ ఇదే విధానం**

అమరావతి, జూన్ 12: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు పరిశ్రమల పని గంటలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ప్రైవేటు రంగంలోపనిచేసే ఉద్యోగులు పది గంటలు పని చేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ రంగంలో పనిచేసే ఉద్యోగుల కోసం కార్మిక చట్టాల్లో భారీ మార్పులు చేపట్టింది. సవరించిన 'ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల చట్టం' ప్రకారం ఇప్పటి వరకు 9 గంటలు పని చేసిన ఉద్యోగులు రోజుకు 10 గంటలు పని చేయాల్సి ఉంటుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులు రోజుకు గరిష్టంగా 8 గంటలు పని చేయడానికి పరిమితి ఉండేది. కొత్త రాష్ట్రం ఏర్పాటు తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పెట్టుబడులు భారీగా ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో పని గంటల పెంపు కూడా ఒకటి. మ్యాన్‌పవర్ అధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పని గంటలు కూడా 10 గంటలు చేస్తే పరిశ్రమలు వచ్చేందుకు మొగ్గు చూపుతాయని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే పదేళ్ల క్రితం 8 గంటలుగా ఉన్న వర్కింగ్ అవర్స్‌ను 9 గంటలకుపెంచారు. ఇప్పుడు సెక్షన్ 54 కింద మార్పులు చేర్పులు చేసి 10 గంటలు చేశారు. దీనితో పాటు సెక్షన్ 55లో కూడా సవరణలు చేశారు. మొదట ఐదు గంటల పని తర్వాత అరగంట విరామం తప్పనిసరిగా ఉండేది, దీన్ని ఇప్పుడు ఆరు గంటల పని తర్వాత ఒక గంట విరామంగా మార్చారు.

ఓవర్ టైం గరిష్ట పరిమితిలో కూడా మార్పులు చేశారు. మొదట ఇది 75 గంటలు ఉండగా, ఇప్పుడు 144 గంటలకు పెంచారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల మంత్రి కె. పార్థసారథి మాట్లాడుతూ.. ఈ మార్పులు ప్రభుత్వ "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానంలో భాగమని అన్నారు. నిబంధనలను కొద్దిగా సడలించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ పెట్టుబడులు వస్తాయని, వ్యాపారం చేయడం సులభం అవుతుందని ఆయన అన్నారు.


పని గంటలు పెంచడాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. కొత్త నిబంధనల కారణంగా ఫ్యాక్టరీ యజమానులు కార్మికులతో నిర్ణీత సమయం కంటే ఎక్కువ, అంటే రెండు గంటలు అదనంగా పని చేయించుకోవచ్చని వారు అంటున్నారు. దీనివల్ల ఉద్యోగులు రోజుకు 12 గంటలు లేదా అంతకంటే ఎక్కువ పని చేయాల్సి రావొచ్చు, ఇది వారి ఆరోగ్యం, వ్యక్తిగత జీవితంపై పెను ప్రభావం చూపుతుందని అంటున్నారు.

భారత్ కార్మిక చట్టాలు, ఫ్యాక్టరీస్ ఆక్ట్-1948, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్స్ ఆక్ట్-1953 ప్రకారం ఎనిమిది గంటల వర్కింగ్ అవర్స్ మాత్రమే అమలులో ఉంది. కానీ ప్లాంటేషన్స్ శ్రామిక చట్టం, 1951 వంటి కొన్ని ప్రత్యేక చట్టాల ప్రకారం కొన్ని రాష్ట్రాల్లోని ప్రత్యేక వెసులుబాటు పొందుతున్నాయి. 10 గంటల వర్కింగ్ అవర్స్‌ను అమలు చేస్తున్నాయి. అవి అస్సాం (టీ ఎస్టేట్స్), తమిళనాడు (ప్లాంటేషన్స్, టెక్స్టైల్స్), కేరళ (ప్లాంటేషన్స్, కొన్ని ఇండస్ట్రీలు), కర్ణాటక (కాఫీ ఎస్టేట్స్, కొన్ని ఫ్యాక్టరీలు), మహారాష్ట్ర (కొన్ని ఫ్యాక్టరీలు, టెక్స్టైల్స్), పశ్చిమ బెంగాల్ (టీ ఎస్టేట్స్, కొన్ని ఫ్యాక్టరీలు) ఇప్పుడు ఈ జాబితాలోకి ఆంధ్రప్రదేశ్ కూడా చేరిపోయింది.

# సంత్ కబీర్ దాస్ జయంతి.. ప్రధానమంత్రి నివాళులు

న్యూఢిల్లీ, జూన్ 12:సంత్ కబీర్ దాస్ జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు తన హృదయపూర్వక నివాళులు అర్పించారు. సామాజిక సద్భావనతో పాటు సంస్కరణ కోసం సంత్ కబీర్ దాస్ తన జీవన పర్యంతం అంకితభావాన్ని కనబరిచారని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ''సామాజిక సామరస్యం కోసం జీవన పర్యంతం అంకితభావంతో నడుచుకున్న సంత్ కబీర్ దాస్ గారికి ఆయన జయంతి సందర్భంగా నేను కోటానుకోట్ల వందనాలు సమర్పిస్తున్నాను. ఆయన దోహాలలో శబ్ద సరళత్వంతో పాటు ప్రగాఢ భావాలను కూడా గమనించవచ్చు. ఈ కారణంగానే భారతీయుల హృదయాల్లో ఆయన ప్రభావం ఈనాటికీ గూడుకట్టుకుని నిలిచింది. సంఘంలో పేరుకుపోయిన దుష్ట సంప్రదాయాల్ని తరిమికొట్టడంలో ఆయన అందించిన తోడ్పాటును మనమంతా శ్రద్ధాపూర్వకంగా స్మరించుకొంటూనే ఉంటాం." అని పేర్కొన్నారు.

# నూతన గృహ ప్రవేశం చేసిన మంత్రి శ్రీహరి



మహబూబ్‌నగర్, జూన్ 12: తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి ఇవాళ మినిస్టర్ క్వార్టర్స్ లో గృహప్రవేశం చేశారు. మంత్రి డా. వాకిటి శ్రీహరి హైదరాబాదు లోని మినిస్టర్స్ క్వాటర్స్ లో ప్రభుత్వం కేటాయించిన ఇంటి నెంబర్ 1లో కేటాయించగా, డా.వాకిటి శ్రీహరి, లలిత దంపతులు వేదపండితుల వేదమంత్రోశ్చరణల మధ్య నూతన గృహప్రవేశం చేశారు.

అనంతరం హోమం, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోదీ ప్రభుత్వానికి 11 ఏళ్లు: కార్మిక మంత్రిత్వశాఖ నేతృత్వాన సామాజిక భద్రత.

న్యూఢిల్లీ, జూన్ 12:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వాన కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్ల సమ్మిళిత, సంస్కరణ-ఆధారిత పాలన వేడుకలు నిర్వహించుకుంటోంది. ఇందులో భాగంగా కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, ప్రజారోగ్య సంరక్షణలో తాను సాధించిన విజయాలను కేంద్ర కార్మిక-ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ ప్రముఖంగా ప్రదర్శిస్తోంది.

ఈ రూపాంతరీకరణకు నిదర్శనాలుగా నిలిచే హైదరాబాద్‌లోని మూడు ప్రముఖ సంస్థలలో బర్కత్‌పురాలోని 'ఇపిఎఫ్ఒ' ప్రాంతీయ కార్యాలయం ఒకటి. డిజిటల్ ఆవిష్కరణల ద్వారా అభ్యర్థనలతోపాటు ఫిర్యాదుల సత్వర, ప్రభావశీల పరిష్కారాలు చూపడం ద్వారా సేవా ప్రదానంలో ఈ కార్యాలయం కొత్త ప్రమాణాలను సృష్టించింది. తదనుగుణంగా దీని పరిధిలో 27 లక్షలకుపైగా ఖాతాలను నిర్వహిస్తుండగా, అధిక వేతనాలపై 98 శాతం పెన్షన్ అభ్యర్థనలను పరిష్కరించింది. ఈ సామర్థ్యం జాతీయ స్థాయిలో ఒక ఆదర్శంగా నిలుస్తోంది.

ఇక మంత్రిత్వ శాఖ పరిధిలోగల సనత్‌నగర్‌లోని 'ఇఎస్ఐసి' వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యవిద్యలో, ప్రజారోగ్య పరిరక్షణలో అగ్రస్థాయిలో నిలిచాయి. ఈ ఆస్పత్రిలో 1,000కిపైగా పడకలు, అత్యాధునిక రోగనిర్ధార సౌకర్యాలు ఉన్నాయి. ఈ ప్రాంగణం ద్వారా ఐటీ ఆధారిత, రోగి-కేంద్రక సేవలతో 72 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు సేవలు అందుతున్నాయి.

మరోవైపు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ లేబర్ వెల్ఫేర్ (డిజిఎల్‌డబ్ల్యు) 50 లక్షల మందికిపైగా అసంఘటిత కార్మికుల అభ్యున్నతికి అవిరళ కృషి చేస్తోంది. ఈ మేరకు విద్యా స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య సంరక్షణ, సామాజిక రక్షణ ద్వారా... ముఖ్యంగా బీడీ, సినీ, మైనింగ్ రంగాల కార్మికుల జీవితాల మెరుగులో తనవంతు పాత్ర పోషిస్తోంది.

ఈ సంస్థలు సాధించిన విజయగాథలపై లోతైన, క్షేత్రస్థాయి అవగాహన కల్పన లక్ష్యంగా మంత్రిత్వ శాఖ 2025 జూన్ 11 నుంచి హైదరాబాద్‌లో 'ప్రెస్ టూర్' నిర్వహిస్తోంది. ఈ నెల 14 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా పథకాల లబ్ధిదారులు, అగ్రశ్రేణి సేవా ప్రదాతలతో పలువురు పాత్రికేయులు నేరుగా సంభాషిస్తారు. 'గైడెడ్ వాక్‌త్రూ, ప్రత్యక్ష ప్రదర్శనలు, ప్రెజెంటేషన్ల' ద్వారా 11 ఏళ్ల కేంద్రీకృత పాలనతో కార్మిక రంగం సాధించిన విస్పష్ట, ప్రజా-కేంద్రక ఫలితాల గురించి మీడియా ప్రతినిధులు ప్రత్యక్షంగా తెలుసుకుంటారు.

# పరవాడ ఫార్మాసిటీలో గ్యాస్ లీక్ - ఇద్దరి మృతి

అనకాపల్లి, జూన్ 12:పరవాడ జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోనీ ఎస్ ఎస్ ఫార్మాస్యూటికల్ ప్రైవేట్ లిమిటెడ్ లో గ్యాస్ లీకై ఇద్దరు మృతి చెందారు . ఒకరి పరిస్థితి విషమంగా ఉంది .

మృతులు పరిమి చంద్రశేఖర్, సరగడం కుమార్, బైడు బైసల్ అను వ్యక్తి చికిత్పొందుతున్నాడు? 1. పరిమి చంద్రశేఖర్ (సేఫ్టీ మేనేజర్ - తెలంగాణ) 2. సరగడం కుమార్ (సేఫ్టీ ఆఫీసర్ - మునగపాక, అనకాపల్లి) గా గుర్తించారు. హెల్పేర్ బైడూ బైసాల్ తీవ్ర అశ్వతతకు గురయ్యాడు చనిపోయిన ఇద్దరు దేహాలను కేజీ మార్చురీకి తరలించారు. .

కాగా, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు గతంలో కూడా ప్రమాదం జరిగిందని భద్రతా ప్రమాణాలు వైఫల్యం వలనే ఈ ప్రమాదం జరిగిందని గని శెట్టి అన్నారు. మృతులు కుటుంబాల కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని గని శెట్టి డిమాండ్ చేశారు.

